క్లుప్తంగా

ముమ్మరంగా వ్యాక్సినేషన్



టీకాలు వేసేందుకు సిద్ధమైన వైద్యారోగ్య సిబ్బంది

విజయనగరం: నగర వ్యాప్తంగా వ్యాక్సినేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఓ వైపు ఫీవర్ సర్వే చేస్తూనే మరోవైపు రోగ నిరోధక టీకాలు వేస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులపై ఆరాతీస్తున్నారు. అలాగే రోగాలు ప్రబలకుండా టీకాలు వేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు ఈ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

శరవేగంగా తాగునీటి పైపులైన్ మరమ్మతులు



పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. పైపులైన్‌కు లీకేజీ పడిన ప్రాంతాన్ని గుర్తించి, లీకులను అరికట్టే చర్యలు చేపడుతున్నారు. వీటీ అగ్రహారం, కొత్తపేట, బీసీ కాలనీలో రెండు చోట్ల పైపులైను లీకేజీలను గుర్తించగా వాటి మరమ్మతులు చేపట్టారు. ప్రజలకు సురక్షితమైన మంచినీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.

వెద సాగుతో అధిక దిగుబడి



సీడ్ డ్రిల్ ద్వారా పొడి వెదలు వేస్తున్న రైతులు

గుర్ల: వరి విత్తనాలను పోడి వెదలుగా వేసి సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని రెడ్డీసీ ఫౌండేషన్ వ్యవసాయ సమన్వయకర్త మంత్రి సంతోష్ అన్నారు. మండలంలోని చింతలపేటలో సీడ్‌డ్రిల్ ద్వారా శనివారం వెదలు వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సమన్వయకర్త సంతోష్ మాట్లాడుతూ.. సీడ్ డ్రిల్ ద్వారా వెదలు వేయడం వల్ల అధిక పిలకలు వస్తాయని, దీంతో దిగుబడి బాగా పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు సూరపు నాయుడు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస వారోత్సవాలు



చినగుడిపాలలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కె.గాయత్రి పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే లాభాలు, పశుగ్రాసం ప్రాముఖ్యత, పశుగ్రాస పెంపకంపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పథకాలను వివరించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి పశువులకు వైద్యసేవలందించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ బి.రామానాయుడు సందర్శించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖరనాయుడు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో పనిచేసే కార్మికులకు ఆల్కహాల్ వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖరనాయుడు మాట్లాడుతూ.. మద్యం అలవాటు వల్ల జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. మద్యానికి బానిసలైన వారిని రీ హాబిలిటేషన్ సెంటర్‌కు పంపించి ప్రత్యేక చికిత్స అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలు తప్పనిసరి

దత్తిరాజేరు: ద్విచక్ర వాహన చోదకులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని ఎస్. బూర్జవలస ఎస్సై రాజేష్ అన్నారు. శనివారం సాయంత్రం స్టేషన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు అన్ని పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.

బాల్యంపై.. బ్యాగు భారం!

- నర్సరీ నుంచే పుస్తకాల మోత
- వయసుకు మించిన బరువుతో అనర్థాలు
- బాలల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న బాలలు



విజయనగరం: పుస్తకాల బ్యాగు భారం బాలల పాలిట శాపంగా మారుతోంది. నర్సరీ నుంచే వయసుకు మించిన బరువు(బ్యాగు నిండా పుస్తకాలు)ను విద్యార్థులు మోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా ఈ బరువు పెరగడమే కానీ ఏ ఏడాదీ తగ్గింది లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండు వంతుల బరువు మోస్తే..అది పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై స్కూల్ బ్యాగు బరువు భారం తగ్గించాలని కొన్ని నిబంధనలను ఎన్‌సీఆర్‌టీ(జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి) జారీ చేసింది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాల సంచి పరిమాణం తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం కూడా సూచనలు చేసింది. ఈ క్రమంలో నెలలో మొదటి, మూడో శనివారం నో బ్యాగ్ డేగా నిర్వహించాలన్న ఆదేశాలున్నా అదేదీ ఆచరణలో కనిపించడం లేదన్న వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఏవి అవసరమో అవే తీసుకువెళ్లాలి..

ఒత్తిడి లేని బోధన విద్యార్థులకు అందించడం అవసరమని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలి. విద్యార్థులు మోయలేనంతగా స్కూలు బ్యాగు ఉండకూడదు. ఏ రోజు తరగతులకు ఏవి అవసరమో అవే తీసుకువెళ్లాలి. తద్వారా శారీరక శ్రమ తగ్గుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుంది. – ఎం.శ్రీనివాసరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు

స్థాయికి మించితే ముప్పే..

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తే పలు రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందని చెబుతున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చని అంటున్నారు. చదువుపై ఏకాగ్రత కూడా తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని అంటున్నారు.

నోబ్యాగ్ అమలెప్పుడో?

విద్యార్థుల్లో ఆహ్లాదం నింపేందుకు అనుభవ పూర్వక పాఠాలను నేర్పేందుకు పుస్తకాలు లేని బడి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతేడాది జూలైలో మార్గదర్శకాలు జారీ చేసింది. 6 నుంచి 8 తరగతుల వరకు విద్యార్థులకు ఏడాదికి 10 రోజులు బ్యాగు లేని బడి నిర్వహించాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. అయితే ఈ నిబంధనల అమలు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రతి శనివారం నోబ్యాగ్ డే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా అమలు చేస్తే ఒక్కరోజైనా విద్యార్థులకు బడి సంచి భారం తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

వాస్తవానికి 1, 2 తరగతులకు 2 పుస్తకాలే..

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు(భాష, గణితం, పరిసరాల విజ్ఞానం) ఉండాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. అయితే ఇప్పుడు ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తరగతి పెరిగే కొద్దీ ఇంకా అధికంగా పాఠ్య పుస్తకాలు మోయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భారం తప్పకపోగా.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు.

ఎన్‌సీఆర్‌టీ ఏం చెబుతోందంటే..

బ్యాగు బరువుపై ఎన్‌సీఆర్ఈటీ నిర్వహించిన సర్వేలో నాలుగైదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీలు పుస్తకాల మోత ఉంటోంది. 8 నుంచి పదో తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. అయితే వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది.

పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి సీసా తదితరాలు అదనం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల మోత ఎక్కువగానే ఉంటోందని ఎన్‌సీఆర్‌టీ పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలనూ రోజూ పిల్లలు మోస్తూ ఇబ్బంది పడుతున్నారు.

మేత తర్వాత.. ముందు ఎండ నుంచి తప్పించుకోవాలి!



ఎండల వేడికి మూగజీవాలు సైతం విలవిల్లాడుతున్నాయి. గత నాలుగైదు రోజుల నుంచి ఎండ సుర్రుమంటోంది. సాధారణ ఉష్ణోగ్రతల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఇంటి నుంచి ఎవరూ అంతగా బయటకు రావడం లేదు. ముఖ్యంగా పశుపోషకులు తమ పశువులను మేతకు భయపడుతున్నారు. మూగజీవాలకు ఏమైనా అవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. నెల్లిమర్ల మండలం, ఏటీ అగ్రహారం చెరువు గట్టు వద్ద ఓ చెట్టు కింద గొర్రెలు, మేకల మంద ఇలా సేదతీరుతున్న దృశ్యం శనివారం సాక్షి కెమెరాకు చిక్కింది. మేత తర్వాత ముందు ఎండ నుంచి తప్పించుకోవాలనే రీతిలో ఈ మూగజీవాలు ఇలా చెట్టు కిందకు చేరాయి. – నెల్లిమర్ల రూరల్

వైఎస్సార్ సీపీలో కొత్త నియామకాలు

విజయనగరం: రాష్ట్ర వైఎస్సార్ సీపీ సంస్థాగత నియామకాల్లో కొత్త నియామకాలు చేపట్టారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన శనివారం విడుదల చేసింది. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా విజయనగరం జిల్లాకు చెందిన బర్రి చిన్నప్పన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా బమ్మిడి అప్పలనాయుడు, బొమ్మి శ్రీనివాసరావులు నియమితులయ్యారు. పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని కొత్తగా నియమితులైన వారు తెలిపారు.

ఉన్నత విద్యా నైపుణ్యాలతో దేశాభివృద్ధి



యూనివర్సిటీ ప్రాక్టికల్ ల్యాబ్‌లను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఉన్నత విద్యా నైపుణ్యాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలనూ నేర్పుతున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం భవిష్యత్‌లో ఎంతో మందికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఆయన ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్‌రాజు ఆహ్వానం మేరకు శనివారం విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ శంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు అక్కడ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంతోపాటు మెకానికల్, వైద్య తదితర విభాగాలలో విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలను చాన్సలర్ వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మహిళలు కుట్టుమని నేర్చుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవడాన్ని డాక్టర్ శంకరరావు ఈ సందర్భంగా అభినందించారు.

పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చీపురుపల్లి తాలూకా యూనిట్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆల్తి రమణ, పరిశీలకుడిగా వి.రాంబాబు వ్యవహరించారు. పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చీపురుపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా టి.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్ఈ.బేగం, కార్యదర్శిగా ఆర్.వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీగా పి.సంతోష్‌కుమార్, కోశాధికారిగా వీవీ సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.తాత, ఎం.అశ్విని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.మురళి, ప్రతినిధులు పీఎం.రవికుమార్, కేబీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరామ్ జీవితం ఆదర్శనీయం



పట్టాభిరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు, తదితరులు

విజయనగరం: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పట్టాభిరామ్ జీవితం ఆదర్శనీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్ కొనియాడారు. స్థానిక గురజాడ పాఠశాలలో విజయనగరం జిల్లా మెజీషియన్ల ఆధ్వర్యంలో పట్టాభిరామ్ సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. పట్టాభిరామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా ఓ రచయితగా, ఇంద్రజాలికుడిగా, మానసిక వైద్యుడిగా గొప్ప పేరుప్రఖ్యాతలు సాధించారన్నారు. ఒకటి కన్నా ఎక్కువ రంగాల్లో రాణించడం సామాన్యులకు సాధ్యం కాదని, అది గొప్ప గొప్ప వ్యక్తులకే సాధ్యమవుతుందన్నారు. ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు కోరారు. అంతకుముందు కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు సముద్రాల గురుప్రసాద్, గోపాలరావు, విజయనగరం గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి సూర్యనారాయణ, సీడబ్ల్యూసీ చైర్పర్సన్ గొటేటి హిమబిందు, ప్రిన్సిపాల్ పూడి శేఖర్‌లు పట్టాభిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ప్రజాసేవ కోసమే ‘జన సేవాదళ్’



మాట్లాడుతున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి అశోక్

విజయనగరం గంటస్తంభం: నగరంలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగే జన సేవాదళ్ శిక్షణా శిబిరాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక అమర్ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవ కోసమే జన సేవాదళ్‌ను సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అప్పట్లో స్థాపించారని గుర్తు చేశారు. తుపానులు, వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జన సేవాదళ్ సేవలందిస్తుందన్నారు. ప్రజాసేవ చేయాలనుకునే వారంతా జన సేవాదళ్‌లో చేరవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, ఉపాధ్యక్షుడు ఎ.సుమన్, సహాయ కార్యదర్శి వి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నెల్లిమర్ల తాలూకా యూనిట్ కొత్త కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడిగా ఏటీవీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జి.రామ్‌గోపాల్, కార్యదర్శిగా పి.సర్వేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కీర్తన ఎన్నిక కాగా కోశాధికారిగా శంకరరావు, కౌన్సిలర్లుగా ప్రభాకర్, శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రోహిణి ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సీఎంఏ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ సత్తా



ఉత్తీర్ణత పొందిన విద్యార్థులతో ఆర్ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయిలో జరిగిన సీఎంఏ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్) ఫౌండేషన్ పరీక్ష ఫలితాల్లో నగరానికి చెందిన ఆర్ఎస్ అకాడమీ సీఏ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. తమ కళాశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ అంట్యాకుల రమేష్ శనివారం తెలిపారు. అకాడమీ నుంచి మొత్తం 22 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఈ మేరకు అకాడమీ వద్ద ఉత్తీర్ణులైన విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యమివ్వండి



విద్యార్థులతో మాట్లాడుతున్న బిసి సంక్షేమశాఖ కమీషనర్ సత్యనారాయణ

- బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ సత్యనారాయణ

పూసపాటిరేగ: విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహం సహా కళాశాల వసతిగృహాలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా హాస్టళ్ల పరిసరాలు, వంటగదులు పరిశీలించి, ప్రతి స్థలం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు రక్తహీనతతో బాధపడకుండా పౌష్టికాహార విలువలతో కూడిన ఆహారం మెనూ ప్రకారం తప్పనిసరిగా అందివ్వాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలని, ఏటా శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. బీసీ కళాశాల వసతిగృహానికి కావాల్సిన స్థలం అందుబాటులో ఉన్నందున ప్రతిపాదనలు పంపిస్తే నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని డీబీసీడబ్ల్యూ జ్యోతిశ్రీకి చెప్పారు. కోనాడలోని బీసీ సంక్షేమ వసతిగృహాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవచ్చన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హాస్టళ్ల వార్డెన్లను ఆదేశించారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూ రాజులమ్మ, సంక్షేమ వసతిగృహ అధికారులు శ్రీదేవి, శరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

• అన్నదాతకు తప్పని కష్టాలు



గుర్లలో విద్యుత్ మోటార్ల లైన్‌కు అనుకుని ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న రైతులు

గుర్ల: మండల కేంద్రంలోని రైతులు కరెంట్ కోసం కష్టాలు పడుతున్నారు. వరి నారుకు నీరు లేక ఎండిపోతున్నాయని, నీరు కట్టడానికి మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. విద్యుత్ లైన్ వెంబడి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎప్పటికప్పుడు సరఫరా నిలిచిపోతోందని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో శనివారం రైతులందరూ ఏకమై జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మోటార్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.